బస్తీ దవాఖాన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొఫెసర్‌ కోదండరాం



ప్రొఫెసర్‌ కోదండరాంను సన్మానిస్తున్న దృశ్యం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సపోర్టింగ్‌ స్టాఫ్‌ వేతనాల పెరుగుదల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రొఫెసర్‌ కోదండరాం తెలిపారు. శనివారం తెలంగాణ బస్తీ దావాఖాన కాంట్రాక్ట్‌, ఔట్‌సోర్సింగ్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ప్రథమ సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సపోర్టింగ్‌ స్టాఫ్‌ ఉద్యోగుల వేతనాలలో మినహాయించిన పీఎఫ్‌ బకాయిలు వెంటనే చెల్లించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రెగ్యులర్‌గా బస్తీ దవాఖాన ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు ఇప్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా ఉన్నట్లు కోదండరాం తెలిపారు. మంగళపాటి సుమన్‌, అంజాద్‌ అలీఖాన్‌, మెతుకు ఉప్పలయ్య, ఆకుల శ్రీనివాస్‌, సన్నీత్‌, నర్సింహ, శాంతమ్మ, స్వప్న, అనిత తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు 'ఏఎస్‌ఎఫ్‌' విందు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని ఇ గలేరియా మాల్‌లోని ఏఎస్‌ఎఫ్‌ బార్బెక్యూ గ్రిల్‌ రెస్టారెంట్‌ తొలి వార్షికోత్సవంను పురస్కరించుకుని నగరంలోని అనాథ శరణాలయాల విద్యార్థులు, వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు సినీనటుడు బెనర్జీ పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

బీసీల మహాధర్నాకు మద్దతు



మహాధర్నాలో ఆర్‌. కృష్ణయ్య తదితరులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి : ఇందిరాపార్కు వద్ద జరిగిన బీసీల మహాధర్నాలో ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ బీసీ నాయకులు పాల్గొని ధర్నాకు మద్దతు ప్రకటించారు. సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేస్తున్న బీసీ కుల సంఘాలు, బీసీ ఐక్యవేదిక సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందని బీసీ నాయకులు శ్రీను, రాజుగౌడ్‌, పోచయ్య, శ్రీహరియాదవ్‌ తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు.శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని సాయివైభవ్‌ కాలనీలో హరిత వైభవోత్సవం కార్యక్రమాన్ని ఆయన మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు చేసి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైనందున అన్ని చోట్లా మొక్కలు నాటేందుకు అందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ఇళ్లలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదం ఉంటుందన్నారు.అనంతరం కాలనీ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు గణేష్‌ముదిరాజ్‌, రమేష్‌, శ్రీనివాస్‌, నారాయణ, కాలనీవాసులు సుజిత్‌కృష్ణ, సరస్వతి, సిద్దార్థ, నవీన్‌, పవన్‌, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

బంజారాహిల్స్‌: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన దృష్ట్యా జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఒకరినొకరు పలకరించుకున్నారు. యాజమాన్యం, ఉపాధ్యాయులు సంతోషకరమైన వాతావరణాన్ని సృష్టించారు. పాఠశాల ఆవరణను స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే శీర్షికలతో రూపొందించిన చార్టులు, పోస్టర్లను ఏర్పాటు చేశారు. చిన్న చిన్న స్కిట్స్‌, కథలు, సంగీతం, ఉపాధ్యాయుల నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ... అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం విధుమోహన్‌ మాట్లాడుతూ... నూతనోత్సాహం, ఉల్లాసంతో కొత్త విద్యా సంవత్సరం గడవాలని ఆకాంక్షించారు. విద్యా సంబంధమైన నైపుణ్యం కలిగి సమర్థతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

రక్తదానం.. ప్రాణదానం

బంజారాహిల్స్‌: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా టెంపెస్ట్‌ అడ్వర్టయిజింగ్‌ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ దక్కన్‌, సాయినగర్‌ హైట్స్‌ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సహకారంతో బేగంపేటలోని ప్రకాష్‌నగర్‌ సాయిసాగర్‌ హైట్స్‌లో నిర్వహించిన విరాళాల సేకరణతో బంజారాహిల్స్‌ ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. వివిధ కార్పొరేట్‌ సంస్థల ఉద్యోగులు, సమాజం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్న టెంపెస్టియన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ చల్లా బ్లడ్‌ సెంటర్‌ ఆపరేషన్‌ హెడ్‌ అర్చన మాట్లాడుతూ... భారత్‌లో ప్రతి రెండు సెకన్లకు ఒక రోగికి రక్తమార్పిడి అవసరమన్నారు. అంతే కాక శస్త్ర చికిత్స, కేన్సర్‌ చికిత్స, బాధాకరమైన గాయాల నుంచి అవసరమైన రోగులకు రక్తదానం ఎంతో అవసరమన్నారు. రక్తం అనేది ఏ వ్యక్తికైనా ఇవ్వగలిగే అత్యంత విలువైన బహుమతిగా ఆమె అభివర్ణించారు. టెంపెస్ట్‌ అడ్వర్టయిజింగ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ తురబ్‌ లక్డావాలా మాట్లాడుతూ... యువత రక్తదాన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌ డ్రిల్‌

లక్డీకాపూల్‌: నిమ్స్‌ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై సెక్యూరిటీ సిబ్బంది మాక్‌ డ్రిల్‌ నిర్వహించింది. శనివారం నిమ్స్‌ మిలీనియం బ్లాక్‌ వద్ద సెక్యూరిటీ విభాగం ఏఎస్‌ఓ రామారావు, నిమ్స్‌ ఎలక్ట్రికల్‌ జేఈ జగదీష్‌ల ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో నివారణ చర్యలను ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ క్రమంలో మంటలను అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించారు. నిజంగా నిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగిందా అనే వాతావరణాన్ని కల్పించారు. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది ప్రమాద నివారణకు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

ముంచుతున్న వర్షం.. పట్టించుకోని యంత్రాంగం

నాలా పనులను వేగవంతం చేయాలని ప్రజల వినతి



ఆదర్శ్‌నగర్‌లోని నాలా చెత్తా చెదారంతో...



ఫ్రెండ్స్‌ కాలనీలో కుచించుకుపోయిన నాలా

మోతీనగర్‌: అకాల వర్షాలతో అల్లాపూర్‌ డివిజన్‌లోని సర్దార్‌నగర్‌, రాజీవ్‌గాంధీనగర్‌, మూసాపేట్‌ డివిజన్‌లోని కబీర్‌నగర్‌, బబ్బుగూడలో పరిస్థితి అధ్వానంగా ఉంది. అల్లాపూర్‌ డివిజన్‌లోని సర్దార్‌నగర్‌, రాజీవ్‌గాంధీ నగర్‌లో గతేడాది కురిసిన అకాల వర్షాలతో వరదనీరు ఇళ్లల్లో చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు ఇళ్ల మధ్య ఉన్న నాలాకు ఇరువైపులా కబ్జాకు గురై నాలా కుచించుకుపోవటంతో ప్రతి ఏటా అకాల వర్షాలతో నాలా నిండి మురుగుతో పాటు వర్షం నీరు ఇళ్లలోకి వస్తాయి. అకాల వర్షాలు వచ్చినప్పుడు నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అనేకసార్లు పనులు చేపట్టినా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారులు అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. మూసాపేట డివిజన్‌లోని కబీర్‌నగర్‌, వీ. రామారావునగర్‌ నుంచి అవంతినగర్‌ తోట వరకు గతంలో నాలా విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.



గతేడాది కురిసిన వర్షంతో రాజీవ్‌గాంధీనగర్‌లో.. (ఫైల్‌)

ఖబ్రస్తాన్‌ను పట్టించుకోండి !

చెట్ల కొమ్మలు, వ్యర్థాలను శుభ్రం చేయని వైనం



రామారావునగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న సమాధులు ఇలా..

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ వి.రామారావునగర్‌ కబరిస్తాన్‌ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి నేలకొరిగిన చెట్లతో పాటు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. ఆదివారం 16న పెద్దల పండుగ ఉన్నందున శ్మశానవాటికను శుభ్రం చేయాలని పారిశుద్ధ్యం ఆర్టికల్చర్‌ డీఆర్‌ఎఫ్‌ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆదివారం పెద్దల పండుగ ఉన్నందున ముస్లింలు, తమ పూర్వీకుల సమాధులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చెత్తాచెదారం నేలకూలిన చెట్లు దర్శనమిస్తున్నాయి. పెద్దల పండుగ ఒకేరోజు ఉండటంతో ఎప్పుడు శుభ్రం చేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సర్దార్‌నగర్‌, రాజీవ్‌గాంధీనగర్‌, పర్వత్‌నగర్‌లోని ముస్లిం శ్మశానవాటికలో కూడా విద్యుత్‌ దీపాలు వెలిగించడంతో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని ఆయా కాలనీల్లోని ముస్లింలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెద్దల పండుగకు ఉచిత ఏర్పాటు చేయాలని పీసీసీ సేవాదళ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌ వాజిద్‌ బాషా పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు శనివారం (కిలో రూ.ల్లో) టమాటా రూ.47, వంకాయ రూ.23, బెండకాయ 50, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, కాకరకాయ 47, బీరకాయ 75, క్యాబేజీ 23, బీన్స్‌ 135, క్యారెట్‌ 40, కాలిఫ్లవర్‌ రూ.23, దొండకాయ 35, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్‌ 19, క్యాప్సికం 70, ఆలుగడ్డ 34, కీరా 32, దోసకాయ 25, సొరకాయ13, పొట్లకాయ 18, కందగడ్డ 45, ఉల్లిపొరక 75, ఉల్లిగడ్డ 39, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడదుంప 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశనగ నూనె 165, పామాయిల్‌ నూనె 97గా ఉన్నాయి.

మంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు



ఓల్డ్‌ బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్‌, నాయకులు షాయిన్‌షా, భరత్‌, కనకరాజుయాదవ్‌ పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు



వీఎస్‌ఎస్‌ శర్మ

కూకట్‌పల్లి: భాషా పండితుల కల ఎట్టకేలకు నెరవేరనుందని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ తెలంగాణ మేడ్చల్‌ జిల్లా శాఖ అధ్యక్షుడు వీఎస్‌ఎస్‌ శర్మ, ప్రధాన కార్యదర్శి రోహిత్‌కుమార్‌ హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో తరగతులు బోధిస్తూ ప్రాథమిక స్థాయి ఎస్‌జీటీలకు సమానమైన వేతనాన్ని పొందుతున్న భాషా పండితులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించనున్నాయని చెప్పారు. తమకు జరుగుతున్న అన్యాయంపై భాషా పండితులు ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, నిరాహారదీక్షలు, విద్యాధికారులపై ఒత్తిడి, కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ.. పదోన్నతుల కోసం పోరాడామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తమ గోడుకు స్పందించి ప్రమోషన్లు కల్పించాలని నిర్ణయించిందన్నారు. దీనిపై ఎస్‌జీటీలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్‌ను శుక్రవారం కోర్టు కొట్టి వేయటంతో భాషా పండితుల పదోన్నతులు వారికి లభించనున్నాయన్నారు. మంజూరైన పోస్టుల ఆధారంగా అర్హులను గుర్తించారన్నారు. వీరిలో తెలుగు పండితులు 97, హిందీ 85, ఉర్దూ ఇద్దరు ఉన్నారని, వీరితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పదోన్నతి పొందనున్నారని వివరించారు. వీరి ధ్రువపత్రాల పరిశీలన పూర్తైందని, మరో రెండ్రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేతలకు బహుమతుల ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: తొలిసారిగా నిర్వహించిన ఇంటర్‌ లొకాలిటీ, ఇంటర్‌ అపార్ట్‌మెంట్‌ క్రికెట్‌ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం ఆదివారం జరుగనుందని నిర్వాహకులు ప్రకటించారు. కేపీహెచ్‌బీ ఫేజ్‌–2లోని టైటెండ్‌ ఎరేనా క్రీడా ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. విజయం సాధించిన క్రికెట్‌ బృందానికి రూ.1లక్ష బహుమతి అందించనున్నామని వివరించారు.

కార్మికుడి కుటుంబానికి చేయూత



డీడీని అందజేస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌ తదితరులు

మూసాపేట: భవన నిర్మాణ పనులకు వెళ్లిన రాజేశ్వర రావు అనారోగ్య సమస్యతో అక్కడే మరణించాడు. కాగా మృతుడి ఆర్థికపరిస్థితిని మూసాపేట డివిజన్‌ కార్పొరేటర్‌ మహేందర్‌ దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించిన ఆయన కాంట్రాక్టర్‌, భవన యజమానిని తన కార్యాలయానికి పిలిపించి మృతుడి కుమారుడు కుమార్‌కు రూ.4 లక్షల డీడీని అందజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు

369 నుంచి 29 జీవీపీలకు తగ్గించామన్న జోనల్‌ కమిషనర్‌



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ అభిలాష అభినవ్‌

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో అధికారులతో జోనల్‌ కమిషనర్‌ అభిలాష అభినవ్‌ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్‌ పరిధిలోని జీవీపీలను తొలగించేందుకు అధికారుల కృషిని ప్రశంసించారు. అన్ని జీవీపీలను తొలగించేందుకు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ఆటోల్లో మాత్రమే చెత్తను వేసేలా కృషి చేశారని అధికారులను అభినందించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మొక్కలు నాటడం, క్యారమ్‌, చెస్‌ వంటి ఆటలతో పాటు 'చాయ్‌పే చర్చ' నిర్వహించారన్నారు. బస్తీ ప్రజలతో జీవీపీ ప్రాంతాల్లో సమావేశమై పార్టీ ఏర్పాటు చేశామన్నారు.

- జీహెచ్‌ఎంసీ పరిధిలో యోగా తరగతులు నిర్వహించాలని అధికారులను కోరారు. రామ్‌కీ ఏజెన్సీ సభ్యులు కూడా ర్యాలీల్లో పాల్గొని తమ ఇంటి వద్ద ఉన్న చెత్తను ఆటో డ్రైవర్లకు ఇవ్వాలని, రోడ్డుపై చెత్తను శుభ్రం చేసేందుకు అవగాహన కల్పించామన్నారు.
- కూకట్‌పల్లి జోన్‌లో 369 నుంచి 29 జీవిపిలను తగ్గించామని, మిగిలిన అన్ని జీవీపీలను తగ్గించేందుకు త్వరలో కృషి చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం, ఏఎంఓహెచ్‌, అసిస్టెంట్‌ మున్సిపల్‌ కమిషనర్‌, డీపీఓ, సీఓ, ఆర్పీ, ఆర్‌డబ్ల్యూ సభ్యులు, రాంకీ ఏజెన్సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



రవిబాబు (ఫైల్‌)

కూకట్‌పల్లి: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి సాయిబాబా కాలనీకి చెందిన సోమేపల్లి రవిబాబు (40) సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి. ఈనెల 14న సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి ప్రకాశంకు బయలుదేరి వెళ్లారు. అక్కడికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వృద్ధుడు..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె. శ్రీను(55) బార్బర్‌ పనిచేస్తుంటాడు. కాకినాడ నుంచి కూకట్‌పల్లిలోని రామాలయం సమీపంలోని తన కుమార్తె ఇంటికొచ్చాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీను (ఫైల్‌)

వేంకటేశ్వర కల్యాణమహోత్సవం





స్వామివారి కల్యాణోత్సవంలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌, శ్రీవారి దర్శనం

మోతీనగర్‌: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు కేంద్ర బిందువులని కాంగ్రెస్‌ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ పేర్కొన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు సుప్రభాత సేవ, విద్యా ఆరాధన, యాగశాల, నిత్య ఆరాధన, నిత్య వాహన పూర్ణాహుతితో పాటు విశేషాలంకరణతో ముత్యాల పందిరిలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. అనంతరం ఉత్సవ కల్యాణ మూర్తులను మేళ తాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్‌ శ్రీనివాస్‌ యాదవ్‌, అంజమ్మ దంపతులు, సైదయ్య, శ్రీలక్ష్మీ యాదవ్‌ దంపతులు సంయుక్తంగా అమ్మవారికి హారాన్ని బహుకరించారు. శ్రీవారి లడ్డూను వేలం వేయగా రూ.1,10,116 భక్తురాలు కై వసం చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు వెంకటేశ్వరరావు, స్థానిక నేతలు ఏడుకొండలు, కేశవరావు, ప్రకాష్‌రావు, రామకృష్ణారెడ్డి, బొంత హరికృష్ణ,నరసింహయాదవ్‌, భారతమ్మ, సుంకన్న, పుష్పారెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పీజేఆర్‌నగర్‌లో డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ లైన్లను శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ జీహెచ్‌ఎంసీ శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పీజేఆర్‌నగర్‌ కొన్నిచోట్ల డ్రైనేజీ లైన్లు చిన్నగా ఉండటంతో డ్రైనేజీనీరు రోడ్లపైకి వస్తుందన్నారు. నిధులు విడుదలైన వెంటనే పెద్ద డ్రైనేజీ లైన్లు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. మారెళ్ల శ్రీనివాసరావు, సీహెచ్‌. భాస్కర్‌, మహేష్‌, బషీర్‌, రాజుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్‌ గార్డెన్‌లో బక్రీద్‌ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అల్లాపూర్‌, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మసీదు కమిటీ నిర్వాహకులు, మతపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బక్రీద్‌ పండుగ సందర్భంగా కుర్బాణీ ఇచ్చిన తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాలను రోడ్లపై పారవేయకుండా పరిసర ప్రాంత నివాసులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ ఇచ్చిన ప్లాస్టిక్‌ కవర్లలో వేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్లాస్టిక్‌ కవర్లను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

WANTED LADY TEACHERS
HEAD MASTER / PRINCIPAL
High School : PHYSICS
PRE-PRIMARY & PRIMARY TEACHERS
Computers | Office Asst. | PET
Salary : 15,000 to 40,000
Forward your Resume to whatsapp or
KPHB COLONY 96409 33665 88853 43978



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132